క్లుప్తంగా

చెస్ సంఘం జిల్లా చైర్మన్‌గా డాక్టర్ రామకృష్ణారెడ్డి

నంద్యాల(వ్యవసాయం): అఖిల భారత చెస్ ఫెడరేషన్‌లో భాగంగా ఉన్న ఆంధ్రా చెస్ అసోసియేషన్.. నంద్యాల జిల్లా చెస్ సంఘానికి అనుబంధ జిల్లా సంఘంగా ఆంధ్రా చెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కేవీవీ శర్మ, ఎస్.భీమారావు ఆదివారం గుర్తింపు పత్రాలు జారీ చేశారు. జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్‌గా డాక్టర్ రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడిగా డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శిగా రామసుబ్బారెడ్డి, కోశాధికారిగా నాగశ్రీనీష్, సుధాకర్, షేక్షావలిరెడ్డి ప్యాట్రన్‌లుగా అసోసియేషన్ ఏర్పడింది. రామకృష్ణారెడ్డి, రవికృష్ణ మాట్లాడుతూ నంద్యాల జిల్లా అసోసియేషన్ ఆంధ్రా చెస్ అసోసియేషన్‌లో భాగంగా పని చేస్తుందన్నారు. జూన్ 8 నుంచి నాలుగు రోజుల పాటు రాష్ట్రస్థాయి అండర్-19 చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తామని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉయ్యాలవాడ : స్థానిక మోడల్‌స్కూల్‌లో 2023-24 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నూర్జహాన్ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు 31-8-2013 మధ్య జన్మించి ఉండాలి, ప్రభుత్వంతో గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2021-22, 22-23లో 5వ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ప్రవేశ రుసుము రూ.75, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150 చెల్లించి ఆన్‌లైన్‌లో ఈ నెల 25వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. లాటరీ ద్వారా కాకుండా ప్రవేశ పరీక్ష నిర్వహించి రిజర్వేషన్ ప్రకారం విద్యార్థులను చేర్చుకుంటామని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారికి స్థానిక మోడల్‌స్కూల్‌లో జూన్ 11న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని వివరించారు.

ప్రోత్సాహక బహుమతులకు దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(వ్యవసాయం): పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులకు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు ఉమ్మడి జిల్లా పద్మశాలీయ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం భద్రావతి భవనారుషి కల్యాణ మండపంలో సంఘం అధ్యక్షుడు భీమునిపల్లె వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 540 మార్కులకు పైగా, ఇంటర్‌లో 900 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు మెరిట్ ఆధారంగా మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.7500, తృతీయ బహుమతి రూ.5వేలు, కన్సోలేషన్ బహుమతులు రూ.2వేల వరకు అందజేస్తామని చెప్పారు. మార్కుల జాబితా, కులధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో పాటు ఫొటోలను ఈనెల 20వ తేదీ లోపు సంఘం కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు సెల్ : 990854124, 9701232676లో సంప్రదించాలన్నారు. రాజేంద్రకుమార్, సాధునారాయణ, వెంకటేశ్వర్లు, పద్మనాభుడు, గాజుల వేణుగోపాల్, చింతలపల్లె వాసు పాల్గొన్నారు.

రామతీర్థానికి పోటెత్తిన భక్తులు

ఆళ్లగడ్డ: శ్రీ రామతీర్థ పుట్టాలమ్మ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం అమ్మవారి రోజు కావడంతో పుట్టాలమ్మను ప్రత్యేకంగా అలంకరించి అర్చన, అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులు శ్రీవల్లీ సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని కొలువుంచి అర్చన, అభిషేకం చేపట్టారు. భక్తులు తరలిరావడంతో క్షేత్ర పరిసరాలు కిటకిటలాడాయి.

వేడుకగా గంగమ్మ జాతర



గంగమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలం ముత్యాలపాడులో గంగమ్మ జాతరను ఆదివారం వేడుకగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి అనంతరం ఉత్సవమూర్తి గంగమ్మను కొలువుంచి సుగంధ పరిమళాలు వేదజల్లే పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారు జామున పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. వేలాది సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా.. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు గ్రామస్తులు, పార్టీ నాయకుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఎంపీపీ వీరభద్రుడు, నాయకులు కుమార్‌రెడ్డి, సొహైల్, రఫీ, రహీమాన్, చాంద్ బాషా ఉన్నారు.

కబడ్డీ విజేత శకునాల జట్టు

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఓర్వకల్లు మండలం శకునాల గ్రామానికి చెందిన సీనియర్ జట్టు మొదటి, స్థానంలో నిలిచి రూ.20 వేలు గెలుచుకుందని ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి తెలిపారు. అదే గ్రామానికి చెందిన జూనియర్ జట్టు రెండో స్థానంలో నిలిచి రూ.15వేలు, మిడుతూరు జట్టు మూడో స్థానంలో నిలిచి రూ.10 వేలు, కాకనూరు జట్టు నాల్గవ స్థానంలో నిలిచి రూ.5 వేలు, వడ్డెమాను జట్టు ఐదో స్థానంలో నిలిచి రూ.4 వేలు, పారుమంచాల జట్టు ఆరో స్థానంలో నిలిచి రూ. 3 వేలు నగదు బహుమతలను అందుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ 'పది'లం

• 10వ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన పేద, మధ్యతరగతి విద్యార్థులు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఆళ్లగడ్డ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజు



గుణప్రియ (546), ప్రియాంక (540), సోని (563), మానస (557), భార్గవి (547), గౌరీశ్వరి, యర్రగుంట్ల



ఎ. కావ్యశ్రీ (561), వెంకటమధు (517), బి.దస్తగిరమ్మ, (496), శ్రీ విద్య, (490), గద్దం శ్రీహన్సి (485), మంగలి భవాని (480)

ఆళ్లగడ్డ: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు ఉత్త ఫలితాలతో మెరిశారు. స్థానిక మోడల్ స్కూల్‌లో 560 అల్లబకాష్, కరిష్మా 530, మైత్రి 516 మార్కులు సాధించారు. అలాగే ఆర్‌పీ ఆర్‌పీ గురుకుల పాఠశాలలో గుణప్రియ 546, ప్రియాంక 540, పడకండ్ల గురుకుల పాఠశాలలో సోని 563, మానస 557, భార్గవి 547 మార్కులు సాధించారు. నియోజకవర్గంలో 53 ప్రభుత్వ పాఠశాలల్లో 2,763 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,295 మంది ఉత్తీర్ణ సాధించడం జరిగింది. ఇందులో 57 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించి పేద తల్లిదండ్రుల కళ్లలో సంతోషాన్ని నింపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

శిరివెళ్ల: మండలంలోని రాజనగరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాయిలత 545, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని మందాల హారిక 524, గోవిందపల్లెలో పాలగిరి కీర్తి 511, స్థానిక పాఠశాల విద్యార్థిని ఆయేషా 500 మార్కులు సాధించారు.

ప్రభుత్వ పాఠశాలలోనూ ఆణిముత్యాలున్నారని యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి గౌరీశ్వరి నిరూపించింది. తన తండ్రి పేదరికంతో ఇబ్బంది పడుతూ, కార్పెంటర్ పనిచేస్తూ తనను, చెల్లెలును చదివిస్తున్నారని పేర్కొంది. మండలంలోనే అత్యధిక మార్కులు 547 సాధించి టాపర్‌గా నిలిచి కుటుంబంలో సంతోషాన్ని నింపింది. బాగా చదివి భవిష్యత్‌లో ఇంజినీర్ కావాలన్నది తన కోరికని చెప్పింది.



మాదర లక్ష్మీదేవి (457)

ఉయ్యాలవాడ : శనివారం వెలువడిన పది ఫలితాల్లో మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక మోడల్ స్కూల్‌లో చదువుతున్న ఇంజేడు గ్రామానికి చెందిన కావ్యశ్రీ 561 మార్కులతో మండల టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ నూర్జహాన్ తెలిపారు. మాయలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెంకటమధ 517 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ తెలిపారు. కొండుపల్లె ఉన్నత పాఠశాలలో దస్తగిరమ్మ 496 మార్కులతో తృతీయ స్థానం, పుచ్చకాయలపల్లె కస్తూర్బాలో శ్రీవిద్య 490,హరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీహన్సి 485 మార్కులు, బోడెమ్మనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళి భవాని 480 మార్కులు, ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదర లక్ష్మీదేవి 457 మార్కులు సాధించి ఆయా పాఠశాలల్లో టాపర్లుగా నిలిచారు. మండలంలో మొత్తం 294 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా 159 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 54 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ అనురాధ తెలిపారు.

నంద్యాల(సిటీ)/నంద్యాల(రూరల్)/గోస్పాడు: నంద్యాల పట్టణం, మండల పరిధిలోని పాఠశాలల్లో శనివారం విడుదలైన పదవ తరగతి పరీక్షలలో నంద్యాల విద్యా కుసుమాలు మెరిసాయి. 8 ఎయిడెడ్ పాఠశాలల్లో 405 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 228 మంది పాసయ్యారు. ఏపీ మోడల్ స్కూల్‌లో 80 మందికి గాను 60 మంది విద్యార్థులు పాసయ్యారు. వారిలో అత్యధికంగా సీ.రాజేశ్వరికి 583 మార్కులు, ప్రభుత్వబాలికల ఉన్నత పాఠశాల 163 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 44 మంది పాస్ కాగా దివ్యజ్యోతికి అత్యధికంగా 406 మార్కులు వచ్చాయి. రెండు కేజీబీవీ పాఠశాలల్లో 69 మందికి 45 మంది ఉత్తీర్ణత సాధించగా స్నేహలత 538 మార్కులు సాధించింది. అదే విధంగా పట్టణంలోని 4 మున్సిపల్ పాఠశాలల్లో 339 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 160 మంది ఉత్తీర్ణత సాధించారు, వారిలో అత్యధికంగా మున్సిపల్ హైస్కూల్ ఎన్‌జీఓ కాలనీకి చెందిన ఎస్ రంగకు అత్యధికంగా 554 మార్కులు సాధించారు. 5 జిల్లా పరిషత్ పాఠశాలల్లో 324 మంది పరీక్షలు రాయగా 164 మంది ఉత్తీర్ణత సాధించగా వారిలో చాపిరేవుల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన సాయిచరణకు 568 మార్కులు వచ్చాయి.



ప్రణయ్‌కుమార్(570), రాజాహుసేన్(538)

గోస్పాడులో....

గోస్పాడు ఏపీ మోడల్ స్కూల్‌లో 90 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 69 మంది ఉత్తీర్ణులై 77శాతం సాధించారు. జెడ్పీహెచ్‌ఎస్ యాళ్లూరులో 57 మందికి 34 మంది పాపై 60 శాతం సాధించారు. కేజీబీవీ బాలికల పాఠశాలలో 31మంది విద్యార్థినులకు 24మంది ఉత్తీర్ణులై 77.4శాతం సాధించారు. దీబగుంట్ల హైస్కూల్‌లో 97మందికి 22మంది పాస్ అయి 23శాతం సాధించారు. అలాగే గోస్పాడు హైస్కూల్‌లో 98మందికి 23మంది పాస్ అయి 23.4శాతం సాధించారు. దీబగుంట్ల హైస్కూల్‌కు చెందిన ఏపీ ప్రణయ్‌కుమార్ 570 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. రెండో స్థానంలో మోడల్ స్కూల్‌కు చెందిన రాజాహుసేన్ 538 మార్కులు సాధించాడు. గోస్పాడు హైస్కూల్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి 536 మార్కులు సాధించి మూడవ స్థానం సాధించాడు. ఇంగ్లిష్ మీడియంలో 250 మంది పరీక్షలు రాయగా 150 మంది పాస్ కాగా 80 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు.



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, పీపీ నాగిరెడ్డి

బస్ షెల్టర్ ప్రారంభం

నంద్యాల: ప్రజల సౌకర్యార్థం బస్ షెల్టర్ శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో బస్ షెల్టర్ నిర్మించడం అభినందనీయమని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి సహకారంతో శిల్పాసేవా సమితి ఆధ్వర్యంలో రూ.7లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్‌ను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా 27 సంవత్సరాలుగా శిల్పాసేవా సమితి తరపున అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంషావలి, కల్లూరు రామలింగారెడ్డి, రాష్ట్ర డైరెక్టర్లు సునీత అమృతరాజ్, చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై విహరించిన పాండురంగడు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గరుడవాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, సుదర్శనాచార్యులు పంచామృతాభిషేకం, మహాగణపతి పూజ, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, సంప్రోక్షణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి పాండురంగడు ప్రత్యేక అలంకరణంలో గరుడవాహనంపై భక్తులకు కనువిందు చేశారు. పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు. గరుడసేవను పురస్కరించుని ఆలయ ఆవరణలో ఒంగోలు కళాకారులచే నిర్వహించిన ఆర్కెస్ట్రా అలరించింది. సోమవారం గజేంద్రవాహనంతో స్వామివారి వాహన సేవలు ముగియనున్నట్లు ఆలయ ధర్మకర్త రాం భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు.



గరుడ వాహనంపై ఆశీనులైన పాండురంగ స్వామి

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

నైట్ వాచ్‌మెన్ల నియామకం పూర్తి

శిరివెళ్ల: మండలంలోని 6 జెడ్పీ ఉన్నత పాఠశాలలకు నైట్‌వాచ్‌మెన్ల నియామకాలు పూర్తియ్యాయని ఎంఈఓ శోభా వివేకవతి ఆదివారం తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు బీసీ-ఏ, మహదేవపురంలో ఎస్సీ, గోవిందపల్లెకు బీసీ, వీరారెడ్డిపల్లెకు బీసీ, యర్రగుంట్లకు బీసీ, రాజనగరం పాఠశాలకు ఓసీ రిజర్వేషన్ కోటాలో వాచ్‌మెన్లను నియమించామని, ఎంపికైన వారు విధుల్లో చేరారని చెప్పారు.

తెల్లదొరల సింహస్వప్నం అల్లూరి

నంద్యాల(అర్బన్): 200 సంవత్సరాలు దేశాన్ని దోపిడీ చేసిన బ్రిటీష్ దొరల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన, వారి పాలిట సింహ స్వప్నం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ కొనియాడారు. ఆయన నాయకత్వంలో ఉమ్మడి గోదావరి జిల్లాలతో పాటు విశాఖ జిల్లాలో గిరిజనులను కూడగట్టి రాయుధ పోరాటం చేశారన్నారు. అల్లూరి సీతరామరాజు 99వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం పీడీఎస్‌యూ నాయకులు అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రఫీ మాట్లాడుతూ రంపచోడవరం, అడ్డతీగల, చింతపల్లి రాజవమ్మంగి తదితర పోలీసు స్టేషన్లపై ముందుగానే వర్తమానం పంపి దాడి చేసిన ధీరోదాత్తుడని కొనియాడారు.

కనుల పండువగా ప్రతిష్ఠోత్సవాలు





వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను ప్రతిష్ఠించిన దృశ్యం, ఎమ్మెల్యే శిల్పాను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

వెలుగోడు: పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులు కొలువు దీరారు. ఈనెల 3వ తేదీ నుంచి విశేష పూజలు అందుకున్న వేంకటేశ్వరస్వామి భూదేవి, శ్రీదేవి, ద్వారపాలకులు, ఆళ్వార్లు, ధ్వజ స్తంభం, బలిపీఠం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి వారి విగ్రహాల ప్రతిష్ఠను ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డి, దాతల సహకారంతో ఆలయ కమిటీ ఏడేళ్ల పాటు శ్రమించి పట్టణంలో శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రారంభం, విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా పీఠాధిపతులు నిత్యానంద భారతిస్వామి, మేడా సుబ్రహ్మణ్యస్వామి, స్థానిక పురోహితులు బ్రహ్మశ్రీ గోపాలకృష్ణశర్మ పూజలు నిర్వహించి వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నూతన విగ్రహాలను ప్రతిష్ఠించారు. మండలం నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యేకు ఘన సత్కారం..

శ్రీలక్ష్మీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సహకరించిన శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రతిష్ఠ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి, శిల్పాభువనేశ్వరరెడ్డికి పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

పోషకాల ముంజ

• వేసవిలో విరివిగా లభిస్తున్న తాటి ముంజలు
• పల్లెల నుంచి పట్టణాలకు తరలింపు
• అలసట తగ్గించే దివ్య ఔషధం



ఎస్పీజీ గ్రౌండ్ వద్ద ముంజలు విక్రయిస్తున్న దృశ్యం,



ముంజెలు విక్రయిస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): వేసవిలో మాత్రమే కనిపించే తాటి ముంజలతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. చూసేందుకు చిన్నగా ఉన్నప్పటికీ పోషకాలతో నిండి ఉంటాయి. మండుతున్న ఎండల నుంచి ఉపశమనాన్ని కలిగించే దివ్య ఔషధం. ప్రకృతి వరప్రసాదంగా ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది. ఎండాకాలంలో మాత్రమే లభించే ముంజలు తప్పక తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వేసవిలో సాధారణంగా మామిడి, పుచ్చకాయ, జామ, ఖర్బూజా ఇలా అనేక రకాల పండ్లు, పానీయాలు తీసుకుంటుంటారు. కానీ వీటిని మించి పోషకాలు ముంజల్లో ఉంటాయంటే అతిశయోక్తికాదు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు తరలించి విక్రయిస్తూ పలువురు ఉపాధి పొందుతున్నారు.

పట్టణంలో విక్రయాలు..

ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్రధాన రహదారుల వెంట తాటి ముంజలు కనిపిస్తున్నాయి. నంద్యాల పట్టణానికి అధికంగా ప్రకాశం జిల్లా పొదిలి మండలం గొట్లగట్టు ప్రాంతం నుంచి ఆటోల్లో తరలించి విక్రయిస్తున్నారు. వీటి ధర డజను సుమారు రూ.వంద ప్రకారం విక్రయిస్తున్నారు. నంద్యాల పట్టణానికి 15 మంది ప్రకాశం జిల్లా పొదిలి నుంచి ముంజలతో వస్తున్నారు. ఎస్పీజీ కాలేజ్ గ్రౌండ్, కర్నూలు జాతీయ రహదారి, ఎస్బీఐ కాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి, శ్రీనివాస సెంటర్, మున్సిపల్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.

పోషకాలు మెండు..

తాటి ముంజల్లో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. విటమిన్‌ఏ, బీ, సీతో పాటు ఐరన్, జింక్, పాస్పరస్, పొటాషియం వంటి ఖనిజ లవణాలుంటాయి. ఇవి శరీరంలోని వ్యర్థాలను బయటకి పంపుతాయి. దీంతో శరీరం శుభ్రమవుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి ఆహారం. తాటి ముంజలకు శరీరాన్ని చల్లబరిచే గుణం ఉంటడంతో వేసవిలో ఎంతో మేలు చేస్తాయి. ఇందులో కేలరీలు తక్కువగా ఉంటాయి, శరీరానికి కావాల్సిన శక్తి ఎక్కువగా ఉంటుంది.

అలసట తగ్గిస్తుంది..

ఎండ వల్ల కలిగే ఆలసట, నీరసాన్ని ముంజలు దూరం చేస్తాయి. బయటికి వెళ్లొస్తేనే విపరీతమైన చెమట పట్టేస్తుంది. ఫలితంగా శరీరం అధిక మొత్తంలో నీటిని కోల్పోతుంది. ఈ క్రమంలో శరీరం కోల్పోయిన నీటిని తిరిగి అందించి, అలసట నుంచి ఉపశమనం పొందడానికి, మలబద్దకం సమస్యను నివారించడంలో ముంజలు బాగా పనిచేస్తాయి. వీటిని తరుచుగా తినడం వలన జీర్ణక్రియ మెరుగు పడుతుంది. అజీర్తి, ఎసిడిటీ సమస్యలు దరిచేరవు. ముఖ్యంగా గర్భిణులకు కూడా వీటి నుంచి ఎన్నో లాభాలున్నాయి.

పొట్టు తీయకుండా తినాలి..

చాలామంది ముంజల పైన పొట్టు లాగా ఉండే పైపొరను తీసేసి తింటారు, కానీ ఆ పొట్టులోనే ఎన్నో రకాల పోషకాలుంటాయి. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అవి చాలా అవసరం. అలాగే ఈ పొట్టు వల్ల శరీరానికి ఎక్కువ చలువ చేస్తుంది. తాటి ముంజల్ని పొట్టు తీయకుండా తింటేనే మంచిది.

క్యాన్సర్లను తగ్గిస్తాయి..

తాటి ముంజల వల్ల వివిధ రకాల ట్యూమర్స్, బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేసే ఫైటోకెమికల్స్, ఆంథోసయనిన్ లాంటి వాటిని నిర్మూలిస్తాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని ఎక్కువగా తినడం వల్ల క్యాన్సర్ల నుంచి కూడా రక్షణ పొందొచ్చు. శరీరంలో గ్లూకోజ్ స్థాయిని పెంచి శరీరానికి కావాల్సిన మినరల్స్, న్యూట్రియంట్ల శాతాన్ని బ్యాలెన్స్ చేయడంలో ముంజలు కీలక పాత్ర పోషిస్తాయి.

డిమాండ్ పెరిగింది

గతానికంటే ఈ ఏడాది తాటి ముంజలకు డిమాండ్ పెరిగింది. గతంలో రూ.20లకు 2 నుంచి 3 పండ్లు ఇచ్చేవాళ్లం. ఇప్పుడు రవాణా ఖర్చు పెరిగింది. పొదిలి నుంచి నంద్యాలకు 100 కాయలు ఉన్న ఒక్క సంచి తీసుకురావడానికి సుమారు రూ.450 వరకు ఖర్చు అవుతుంది. అందుకే ధర కాస్తా పెరిగింది. పంటపొలాల గట్ల పైన తాటి చెట్లను పెంచుతున్నాం. చెట్లు 30 సంవత్సరాలు పెరిగిన తర్వాత పంట లభిస్తుంది.

– వెలిగొండ రాయుడు, గొట్లగట్టు,పొదిలి

ముంజలు తింటే ఆరోగ్యానికి మంచిది



తాటి ముంజలు తినడం ఆరోగ్యానికి మంచిది. ఈ పండు ఎన్నో రకాల పోషకాలను కలిగి ఉంటుంది. వేసవిలో శరీరానికి కలిగే అలసత్వాన్ని ఈ పండ్లు తినడం ద్వారా తగ్గుతుంది. ఇందులో ఉండే విటమిన్లు, జింక్, పాస్ఫరస్, ఖనిజ లవణాలు మనిషికి రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయి. ముంజలు తినేటప్పుడు పొట్టును తీయకూడదు, అలాగే తింటే చాలా వరకు లాభాలు శరీరానికి అందుతాయి.

– డాక్టర్ అంకిరెడ్డి, ఎంహెచ్ఓ, నంద్యాల

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

మహానంది: ఆలయాల ధర్మకర్తగా పనిచేసే అవకాశం రావడం ఎంతో అదృష్టమని, ఆలయాభివృద్ధికి ధర్మకర్తలు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి సూచించారు. బుక్కాపురం శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్‌గా మారెడ్డి శ్రీనివాసులు, ధర్మకర్తలుగా రామమూర్తి శర్మ, వల్లూరి రమణారెడ్డి, మంగలి వెంకటరమణ, కుంచపు రమణమ్మ, పులిమద్ది లక్ష్మీదేవి, నాగపూరి జ్యోతి, ఎరుకల వెంకటలక్ష్మి ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. వారితో గ్రూపు ఆలయాల ఈఓ స్వర్ణముఖి, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీ నరసమ్మ, సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, నాయకులు శరభారెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ సుదర్శనం, కందుల రఘురామిరెడ్డి, కుంచపు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్ర అదనపు కార్యదర్శిగా జహురుల్లా

నందికొట్కూరు: పట్టణంలోని జైలులో వార్డెన్‌గా పని చేస్తున్న జహురుల్లాను రాష్ట్ర జైళ్ల శాఖ ఉద్యోగ సంఘం అదనపు కార్యదర్శిగా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలు శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. జైలు శాఖ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు వచ్చిన ముందుండి పోరాడుతానని చెప్పారు. తమకు రాష్ట్ర బాధ్యతలు అప్పగించిన జైలు శాఖ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంబుల విశ్వేశ్వరావుకు కృతజ్ఞతలు తెలిపారు.